**కథ :**

# అసలైన ఆస్తికుడు

-మాధవపెద్ది ఉష

అదొక కాలనీలోని పార్కు. ప్రతి రోజూలానే ఈ రోజుకూడా చక్రవర్తిగారు అలవాటుగా కూర్చొనే సిమెంటు బెంచి మీద కూర్చుని స్నేహితుడి కోసం నిరీక్షిస్తున్నారు. సమయం ఆరవుతోంది. అప్పటిదాకా కేరింతలు కొడుతూ ప్రపంచంలోని ఉత్సాహమంతా తమలోనే ఇమిడిందా అన్నట్లు ఆడుకొంటున్న పిల్లలు ఇంటిముఖం పట్టారు. చుట్టూ చిరు చీకట్లు అలుముకుంటున్నాయి. అందుకు నిదర్శనంగా పార్కులోని లైట్లు వెలిగాయి.

'ఇంకా రాలేదేమిటబ్బా ఈ ఉమాసుతరావు' అనుకొంటున్నారు చక్రవర్తిగారు. ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేసి దాదాపు ఒకేసారి రిటైరయ్యారు. మంచి మిత్రులు. అందుకే రిటయిర్డ్ లైఫ్‌ని కలిసి పంచుకుందామన్న ఉద్దేశ్యంతో ఒకే కాలనీలో ఇళ్ళు కొనుక్కున్నారు. అప్పటినుండి రోజంతా ఎలా గడిపినా సాయంకాలం ఆరయ్యేసరికి ఈ పార్కులో హాయిగా స్వచ్ఛమైన గాలి పీలిస్తూ, విశ్రాంతిగాకూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకోవటం, కష్ట సుఖాలు చెప్పుకోవటం, అవసరం అయితే ఒకరికొకరు సలహాలు ఇచ్చుకోవటం తిరిగి ఎనిమిదింటికల్లా ఇళ్ళకు చేరుకోవటం పరిపాటి అయిపోయింది వారికి.

అది ఎంతగా అలవాటు అయిపోయిందంటే ఒక్కరోజు ఏ కారణం చేతనయినా కలుసుకోలేకపోతే ఆ రాత్రి ఇద్దరికీ నిద్రపట్టదు. అంత గాఢంగా అల్లుకుపోయాయి వారి మనస్సులు.

ఈ రోజు కూడా స్నేహితుడి రాక ఆలస్యం అవుతున్న కొద్దీ చక్రవర్తిగారిలో ఆరాటం అధికం కాజొచ్చింది. అసలు స్నేహంలోనే ఉంది ఆ మాధుర్యం. స్నేహామృతాన్ని చవి చూసినవారికి తప్ప ఇతరులకి అంతుపట్టని విషయం అది. అయినా ప్రేయసీ ప్రియులలాగా తనలో కలుగుతున్న ఆరాటానికి నవ్వు వచ్చింది చక్రవర్తిగారికి. ఇంతలోనే దూరం నుంచి ఉమాసుతరావుగారు చేతిలో వాకింగ్ స్టిక్‌తో రావటం కనిపించింది. అప్పటికి కుదుటపడింది చక్రవర్తిగారి మనస్సు. హమ్మయ్య మొత్తానికి దర్శనమిచ్చాడు అనుకున్నారు.

"ఏరా ఇంతాలస్యం? ఈ రోజు తమరి దర్శనభాగ్యం లభించదని నిర్ణయంచేసుకున్నాను" అన్నారు చక్రవర్తిగారు కాంతివంతమైన ముఖంతో.

"ఏం లేదురా ఈ రోజు మా నాన్నగారి ఆబ్దికం. బ్రాహ్మడు ఆలస్యంగా వచ్చాడు. ఇంకెక్కడో కూడా ఒప్పుకున్నాడట. భోజనాలు అయ్యేటప్పటికీ నాలుగయింది. కాసేపు నడుం వాల్చాను. తెలీకుండానే నిద్రపట్టేసింది. మళ్ళా లేచి తయారయి వచ్చేటప్పటికి ఇంతాలస్యం అయింది. అసలు రాకూడదనే అనుకున్నాను. కానీ నువ్వు ఎంత ఆదుర్దాగా ఎదురు చూస్తావో నాకు తెలుసుగా! అందుకే నిన్ను డిజపాయింట్ చేయటం ఇష్టంలేక ఎలాగో ఓపిక చేసుకుని వచ్చాను" అన్నారాయన.

స్నేహితుని మొహంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తున్న అలసటని గమనిస్తూ, ఒకింత సానుభూతితో ఇలా అన్నారు చక్రవర్తిగారు,

"అది సరే, నువ్వు ఈ చాదస్తాలని ఎప్పుడు మానుకుంటావురా? అసలు ఆబ్దికం అనేది ఎందుకు పెట్టారో, దాని వెనుక గల ముఖ్య ఉద్దేశ్యమేమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించావా ఎప్పుడైనా? కనీసం ఆ వంకతోనైనా మనం మన పెద్దలను ఏడాదికోసారి మనస్ఫూర్తిగా తలుచుకోవాలనేరా! అందుకు శాస్త్రోక్తంగా తద్దినమే పెట్టి తీరక్కరలేదు. ఆ రోజు వారి పేరుతో ఏ అన్నదానమో లేక ఏ బీద వ్యక్తికో ధనసహాయమో లాంటి మంచి పనులు చేసినా కూడా వారి ఆత్మసంతృప్తి చెందుతుందని నేను నమ్ముతాను, ఈ రోజులలో మడీ తడీ పాటించి తద్దినాలు పెట్టడం అంటే మాటలా? నీకా వృద్ధాప్యం వచ్చేసింది. ఎంతకాలం ఈ చాదస్తాలను పాటిస్తూ శ్రమపడతావు?"

ఉమాసుతరావుగారు, ఏదో మహాపరాధం చేసినట్లు చూసారు చక్రవర్తిగారిని.

"ఆ మాటంటే నేను ఒప్పుకోనురా! మన హిందూ మతం ప్రకారం ఇవన్నీ ప్రతి కొడుకూ పాటించి తీరవలసిన ధర్మాలు. పితృకర్మలు చేయటం తనయుల విధి. తన విధి నెరవేర్చనివాడికి ఇహంలోనూ పరంలోనూ కూడా ముక్తి లేదని మన శాస్త్రాలు, పురాణాలూ ఘోషిస్తున్నాయి. కానీ భగవంతుడా అదృష్టం నా నుదుట రాయలేదు" అన్నారు బాధగా.

"ఏ అదృష్టం రా?" అడిగారు చక్రవర్తిగారు.

"అదే కొడుకు చేత తలకొఱివి పెట్టించుకునే భాగ్యం నాకు లేదు. పున్నామనరకం తప్పదు..." అన్నారు ఉమాసుతరావుగారు. ఆ కంఠంలో అంతులేని ఆవేదన.

"పున్నామనరకం అంటే ఏమిటో, అదెలా ఉంటుందో చెప్పగలవురా?" చక్రవర్తిగారి స్వరంలో కించిత్ వేళాకోళం ధ్వనించింది.

"నువ్వలాగే అంటావురా. తిన్నమ్మకేం తెలుసు మొగుడాకలని, నీకేం నిక్షేపంలాంటి కొడుకున్నాడు నీకు కర్మలు చేయటానికి, నా బాధ నీకెలా అర్థం అవుతుంది?"

"ఒరేయ్ ఒరేయ్ ఆపరా నీ శరపరంపర, ఇంతకీ నాకు కొడుకున్నాడనేనా నీ బాధ. తల్లి దండ్రులకు ఏనాడూ తద్దినం పెట్టని నేను, నాకు మాత్రం నా కొడుకు తద్దినాలు పెట్టాలని ఎలా ఆశిస్తాననుకున్నావురా?"

"అయినా నీలాంటి నాస్తికునితో ఈ విషయాలు చర్చించటం నాదే బుద్ధితక్కువగానీ వదిలేయి ఇంకేమన్నా మట్లాడుకుందాం." అన్నారు ఉమాసుతరావుగారు.

"ఒరేయ్ విగ్రహారాధన చేయనంత మాత్రాన నేను నాస్తికుడినైపోతానురా. నా ఉదేశ్యంలో భగవంతుని కొలవటానికి విగ్రహారాధన పేరుతో గంటలకి గంటలు పూజలు చేయక్కరలేదు. ఈశ్వరార్పణ బుద్ధితో తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తిస్తే చాలు నన్ను భక్తితో కొలిచినట్లేనని చెప్పాడు శ్రీ కృష్ణుడు భగవద్గీతలో దాన్నే కర్మయోగమన్నారు."

" ఈ కలియుగానికి కావలసినది కర్మయోగమేనని నా దృఢాభిప్రాయం. ప్రస్తుత సమాజంలో మన సహాయం కావలసిన దీనులూ, ఆర్తులూ, బీదలూ, బాధితులూ ఎంతోమంది ఉన్నారు. వాళ్ళందరి జీవితాలకూ చేయూతనిచ్చి ఒక గాడిలో పడవేయవలసిన బాధ్యత మన మీద ఎంతైనా ఉంది. అంతే కానీ భక్తి పేరుతో ముక్కు మూసుకుని కూర్చుని గంటలకి గంటలు వృధా చేయటం ఏమంత సబబు? భక్తి మనస్సులో ఉంటే చాలు.

అంతెందుకు. కొంతమంది భక్తి పేరుతో దేవుడికి శ్రేష్ఠమని నేతితో దీపారాధన చేస్తారు. నన్నడిగితే దాని బదులు ఆ నేతితో ఏదైనా స్వీటు చేసి ఏ బీద పిల్లలకో పంచి పెట్టటం మంచిదంటాను. అవి తింటున్నప్పుడు ఆ పిల్లల కళ్ళల్లో వెలిగే ఆనంద జ్యోతులు చూస్తుంటే కలిగే తృప్తి, ఎన్ని నేతి దీపారాధనలు చేస్తే వస్తుంది?

అంతేకాదు! నువ్వు చెప్పే ఈ సోకాల్డ్ ఆస్తికులు ఎంతటి సంకుచితులూ ఎంతటి శరీరాభిమానులూ అంటే, చనిపోయిన తరువాత ఎందుకూ పనికిరాని, శరీరంలోని ఏ భాగాన్నీ కూడా తీయటానికి ఒప్పుకోరు. చనిపోయాక తమ శరీరానికి దహన క్రియలు సరిగ్గా జరగాలనీ, తమ స్వంత ఊళ్ళో అయిన వాళ్ళ మధ్యన కొడుకు సన్నిధిలోనే తనువు చాలించాలనీ కోరుకుంటారు. తాము చనిపోయాక తమ శరీరాన్ని ఏ కాకులూ గద్దలూ తింటాయోనన్న ఊహే భరించలేనంత పేరుకొని ఉంది వీళ్ళలో! మనిషిలోని శరీరాభిమానానికిది పరాకాష్ట." చిన్న ఉపన్యాసం ఇచ్చారు చక్రవర్తిగారు.

"మరయితే ఏమంటావు...నువ్వు చనిపోయాక హిందూ ధర్మం ప్రకారం దహన క్రియలక్కర లేదంటావేమిటి? ఏ కాకులకో గద్దలకో వేయమంటావేమిటి కొంపతీసి నీ కొడుకుని?" అన్నారు ఉమాసుతరావుగారు ఎగతాళిగా.

ఒక చిరు దరహాసం క్షణకాలం వెలిగి మాయమైంది, చక్రవర్తి గారి పెదవుల మీద.

"అహ అది కాదు...చనిపోయిన తరువాత కూడా ఈ శరీరం ఇంకొకరికి ఏ విధంగానైనా ఉపయోగపడితే అంతకన్నా అదృష్టం ఉండబోదంటాను. అవసరం అయితే కాకులకీ గద్దలకీకేయటానికి కూడా వెనుకాడకూడదు." అన్నారు కొద్దిగా ఆవేశంగా.

ఇద్దరి మధ్యా కొద్ది సేపు మౌనం రాజ్యం చేసింది. అప్పటి వరకూ ప్రపంచాన్నే మరచినట్లుగా తమ సంభాషణలో లీనమయిన మిత్రులిద్దరూ ఒక్కసారిగా తెలివి తెచ్చుకుని చుట్టూ చూసారు.

ఆకాశంలో చంద్రుడు చల్లని కిరణాలను ప్రసరిస్తున్నాడు. ఆ వెలుగులకి వెలవెలపోతున్నాయి తారల ముఖాలు. జీవన సంధ్యా ప్రాంగణంలో అడుగిడిన ఆ వృద్ధులిద్దరూ లేచారు. ఎప్పుడు కారు చీకట్లు అలుముకుంటాయో ఎప్పుడు జీవితం అంధకార బంధురమవుతుందో తెలియదు కదా...!

❁ ✻ ❁ ✻ ❁

మర్నాడు ఉదయమే నిద్ర లేచి పళ్ళు తోముకుంటున్న ఉమాసుతరావు గారికి, చక్రవర్తిగారి కొడుకు పరుగు పరుగున వచ్చి అందించిన వార్త - రాత్రి దాదాపు 3 గం॥ ప్రాంతంలో చక్రవర్తిగారికి హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చిందనీ, పరిస్థితి యొక్క సీరియస్‌నెస్‌ని గమనించి డాక్టర్‌ని పిలుచుకొచ్చేటప్పటికే సెకెండ్ ఎటాక్ రావటం చక్రవర్తిగారి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోవటం జరిగిపోయాయని.

ఆ వార్త విని నిశ్చేష్టులయ్యారు ఉమాసుతరావుగారు. నిన్నటిదాకా తనతో నవ్వుతూ మాట్లాడిన తన ఆత్మీయుడు, తనకిక లేడంటే నమ్మ శక్యం కావటం లేదు. ఇంతలో ఆయనకి కర్తవ్యం స్ఫురించి వడి వడిగా చెప్పులు వేసుకుని చక్రవర్తి గారింటివైపు వేసారు.

❁ ✻ ❁ ✻ ❁

ఇంట్లోకి అడుగు పెడ్తూనే ఆయన చూసిన దృశ్యం మనస్సుని కలచి వేసేటట్లుగా ఉంది. హాల్లో తన ప్రాణ మిత్రుడు నిర్జీవంగా నేలమీద... చూడలేక రెండుచేతులతో కళ్ళు మూసుకున్నారు. అలా ఎంతసేపుండిపోయారో. చూస్తూండగానే ఇల్లంతా జనంతో నిండిపోయింది. దుఃఖ తీవ్రత కొద్దిగా తగ్గగానే చక్రవర్తి తన బాడీని హస్పిటల్‌కి డొనేట్ చేసాడట అన్న మాటలు వినపడ్డాయి. ఆయన ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తన చెవులని తనే నమ్మలేకపోయారు. అనుమాన నివృత్తికోసం ఆయన కొడుకుని పిలిచి అడిగారు.



“నిజమేనండీ. నాన్నగారు ఎప్పుడో కోరిన కోరిక అది. మన హాస్పిటల్స్‌లో బాడీల కొరత ఉన్నదనీ మెడికల్ కాలేజి స్టూడెంట్లకి ఎనాటమీ క్లాసెస్‌కి సరిపడా బాడీలు లభ్యం కావటం లేదనీ, అందుకు స్టూడెంట్స్ అంతా ఎంతో ఇబ్బంది పడుతున్నారనీ, అందుకే ప్రజలు తమ దేహాలను డొనేట్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అంటూండేవారు. అందుకే అందుకు కావలసిన ఫారమ్‌లన్నీ ముందే ఫిలప్ చేసి ఉంచారు నాన్నగారు”.

ఉమాసుతరావుగారికి అప్పుడు అర్థం అయింది, చక్రవర్తిగారు క్రితం రోజు పార్కులో తనతో అన్న మాటలకంతరార్థం. చనిపోయాక నీ శరీరాన్ని కాకులకీ గద్దలకీ వేయమంటావా అని ఎగతాళి చేసాడు. తనెంత మూర్ఖుడు...? ఎంత తెలివి తక్కువగా మాట్లాడాడు!

దివంగతుడైన స్నేహితుడి మీద ప్రేమాభిమానాలు ఉప్పొంగగా ఆర్ద్రంగా ఇలా అనుకున్నారు.

“ఒరేయ్ చక్రవర్తీ నేనేమో అనుకున్నానురా. అర్థం లేని ఆచారాలను పట్టుకుని వేళ్ళాడే నాలాంటి మూఢ భక్తులున్న ఈ సమాజంలో, అనుకున్నది అనుకున్నట్లు ఆచరించగల మనస్స్థైర్యం గల నువ్వురా అసలైన ఆస్తికుడివి. భరత మాతకినాడు కావలసింది నీ లాంటి కర్మయోగులే కానీ, తమ పాప ప్రక్షాళన కోసం వ్యర్థ పూజలతో కాలం వెళ్ళబుచ్చుతూ భగవంతుడిచ్చిన ఈ దుర్లభమైన మానవ జీవితాన్ని వృధాచేసుకుంటున్న ఆస్తిక బృందం కాదురా. నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నందుకు నన్ను క్షమించరా!” మిత్రునికి భారమైన మనస్సుతో బాష్పాంజలి ఘటించారు ఉమాసుతరావుగారు. ❑